ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేది: 06.06.2026 సమయం: 07.05 గంటలు

ముఖ్యాంశాలు

1. రంగారెడ్డి జిల్లా కోహెడలో అత్యాధునిక సమీకృత పండ్ల మార్కెట్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సాయంత్రం శంకుస్థాపన చేయనున్నారు.

2. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి పాలమూరు జిల్లాల్లోని ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు.

3. హైదరాబాద్ లోని ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లను నిర్మించనుంది.

4. భూముల మార్కెట్ విలువల పెంపుపై ఎలాంటి శాస్త్రీయత లేకుండా ప్రభుత్వం భూముల ధరలను పెంచిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఆరోపించారు.

---

**కోహెడ్ మార్కెట్ శంకుస్థాపన**

రంగారెడ్డి జిల్లా కోహెడలో అత్యాధునిక సమీకృత పండ్ల మార్కెట్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సాయంత్రం శంకుస్థాపన చేయనున్నారు. 179 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల 387 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నిర్మాణం కానున్న ఈ ప్రాజెక్టు, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో మూడేళ్లలో పూర్తికానుంది. సాయంత్రం 5 గంటలకు రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 25 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. కోహెడ

పండ్ల మార్కెట్ ఉద్యాన రైతులకు వరంగా మారనుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పండ్ల వ్యాపారం, నిల్వ, రవాణా, మార్కెటింగ్‌కు కోహెడ్ ఫ్రూట్ మార్కెట్ లో సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

**HYD -PTC**

-------------------------------

**జడ్చర్ల సభలో సీఎం స్పీచ్**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో రెండు రోజుల పాటు రిజర్వాయర్లు, పంప్ హౌస్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాత్రి జడ్చర్ల బహిరంగ సభలో పాల్గొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేశారు. కె.చంద్రశేఖర్ రావు హయాంలో ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదన్నారు. దీంతో పాలమూరు జిల్లా భూములకు సాగునీరు రాలేదని, ప్రజల కష్టాలు తీరలేదని అన్నారు. పదేళ్లలో కాళేశ్వరం కోసం లక్ష కోట్లు ఖర్చు చేశారు కానీ... ఉద్దండపూర్ మునిగితే 800 కోట్లు ఇవ్వలేదని విమర్శించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వలస బతుకులు పోవాలంటే పిల్లల్ని చక్కగా చదవించాలని, చదువొక్కటే జీవితాల్లో వెలుగు నింపుతుందని తెలిపారు.

**డెస్క్**

--------------------------------

**పేదలకు ఇందిరమ్మ ఇల్లు**

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. హైదరాబాద్ లోని ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. క్యూర్ పరిధిలోని నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఉపాధికి ఇబ్బంది లేకుండా లక్ష ఇళ్లను నిర్మించనుంది. ఈ పథకంలో ఆడబిడ్డలనే లబ్ధి చేకూరుస్తూ, వారి పేరు మీదనే ఇంటి పట్టాలు అందించనున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. సచివాలయంలో హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్, అధికారులతో మంత్రి  సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.  400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్ల డిజైన్లను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటికే పరిపాలన అనుమతులు మంజూరయ్యాయని మంత్రి స్పష్టం చేశారు.

**HYD -PTC**

---------------------------------

**భూముల విలువ పెంపుపై ఆగ్రహం**

తెలంగాణలో భూముల మార్కెట్ విలువల పెంపుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి శాస్త్రీయత లేకుండా ప్రభుత్వం భూముల ధరలను అమాంతం పెంచి, సామాన్యుల సొంతింటి కలను దూరం చేస్తోందని అన్నారు. ఇప్పటికే సంక్షోభంలో ఉన్న రియల్ ఎస్టేట్ రంగాన్ని భూ ధరల పెంపు మరింత దెబ్బతీస్తుందని విమర్శించారు. పాత ధరల ప్రకారం చలాన్లు కట్టిన వారికి కూడా పెంపును వర్తింపజేయడం తగదన్నారు.

**HYD –PTC**

---------------------------------

**సీపీఐ తరగతులు**

సమకాలిన రాజకీయాలపై అవగాహన కల్పిస్తూ... కార్యకర్తలను నాయకులుగా తయారు చేసేందుకు  శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని సీపీఐ  సీనియర్ నాయకుడు, మాజీ శాసనసభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు.  వేములవాడలో  ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ  ప్రపంచంలో, దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను, మానవాళి ఎదు ర్కొంటున్న సమస్యలను అవగహన చేసుకోవడానికి, శిక్షణ తరగతులు ఎంతో దోహదపడుతాయని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు.

**సిరిసిల్ల పీటీసీ**

-----------------------------------

**థ్రెడ్ పోచంపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ లోని హైటెక్స్ లో థ్రెడ్ పోచంపల్లి ప్రదర్శన కొనసాగుతోంది. థ్రెడ్ పోచంపల్లి చేనేత వస్త్ర ప్రదర్శనను నిన్న రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే చేనేత వస్త్ర ప్రదర్శన రేపు ముగుస్తుంది. పోచంపల్లి చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ స్థానిక కళాకారుల సృజనాత్మకతకు, నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపని మంత్రి తెలిపారు.

**డెస్క్**

--------------------------------

**కరీంనగర్ లో మహేష్ గౌడ్**

ప్రజలకు విద్య, ఉద్యోగాలు, మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రాత్రి కరీంనగర్ లో రవాణా శాఖ మంత్రి పొన్నం, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కరీంనగర్ లో  శాతవాహన అర్బన్ డెవలప్ మెంట్ నిధులతో నూతనంగా అధునీకరించిన IDSMTషాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొన్నారు.  సుడాకు నిధులతో నిర్మించతలపెట్టిన నైట్ ఫుడ్ కోర్టు కాంప్లెక్స్ కు  శంఖు స్థాపన చేశారు. అనంతరం రాజీవ్ చౌక్ లో రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహాన్ని మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. యువత ప్రపంచ దేశాలతో పోటీ పడాలనే లక్ష్యంతో రాజీవ్ గాంధీ అనేక సంస్కరణలు తీసుకువచ్చారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

**కరీంనగర్ పీటీసీ**

--------------------------------

**ములుగులో శంకుస్థాపనలు**

ములుగులో సిఆర్ఆర్ 2025-26 నిధులతో పలు అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ రహదారి-163 నుంచి ఎరుకలవాడ వరకు 6 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఎస్సీ కాలనీ వరకు 5 కోట్ల 75 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపడతారు. ములుగు టౌన్ తూర్పు భాగంలో 5 కోట్ల 95 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లను నిర్మిస్తారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...

**BYTE- సీతక్క**

**ములుగు పీటీసీ**

----------------------------------

**తడిసిన ధాన్యం కొనుగోళ్లు**

అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు కరీంనగర్ జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి నర్సింగరావు తెలిపారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ లో తడసిన దాన్యాన్ని కొనుగోలు చేసి లారీలకు లోడింగ్ చేసే ప్రక్రియను జిల్లా సివిల్ సప్లై మేనేజర్ రజినీకాంత్ తో కలిసి నర్సింగరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఆకాశవాణితో ప్రతినిధితో మాట్లాడుతూ...

**BYTE- నర్సింగరావు, జిల్లా అధికారి**

**కరీంనగర్ పీటీసీ**

---------------------------------

**ఎబోలా నెగటివ్**

సుడాన్ నుంచి హైదరాబాద్ వచ్చిన వ్యక్తిలో ఎబోలా లేదని నిర్ధారణ అయ్యింది. 35 ఏళ్ల వ్యక్తికి తొలుత ఎబోలా లక్షణాలు కనిపించడంతో ఇటీవల సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి వ్యక్తిని తరలించారు. ఐసొలేషన్ వార్డులో ఉంచి అతనికి చికిత్స అందించారు వైద్యులు.

శాంపిల్స్ సేకరించి పూణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్ కు పంపారు. అయితే రిపోర్ట్ లో నెగటివ్ వచ్చింది.

**HYD -PTC**

-----------------------------------

**మెదక్ బర్డ్ వాక్**

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మెదక్ జిల్లాలోని పోచారం అడవులలో బర్డ్ వాక్ ను నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ మంచు నగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పక్షులను ప్రేమించాలని అదనపు కలెక్టర్ మంచు నగేష్ పిలుపునిచ్చారు. రేడియేషన్ తో పక్షులు అంతరించిపోతున్నాయని, పోచారం అడవిగుట్టలో రాబందులు అంతరించిపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పక్షుల గురించి పిల్లలకు వివరించాలని సూచించారు.

**బైట్  మంచు నగేష్ అదనపు కలెక్టర్**

**మెదక్ పీటీసీ**

--------------------------------

**పెండింగ్ దరఖాస్తులపై..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూభారతి, సాదా బైనామా, ఇతర భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మండలాల వారీగా భూభారతి దరఖాస్తులు, సాదా బైనామా కేసులు, భూసేకరణ అంశాల పురోగతిపై తహసీల్దార్లు, సర్వేయర్లు, కలెక్టరేట్‌కు చెందిన సంబంధిత శాఖల సూపరింటెండెంట్లతో కలెక్టర్ సమీక్ష చేశారు.

**భద్రాద్రి కొత్తగూడెం పీటీసీ**

-------------------------------

**పెండింగ్ పనులు**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో పెండింగ్ పనులను శరవేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. నల్గొండ లోని  గొల్లగూడ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాన్ని కలెక్టర్ పరిశీలించారు.

**నల్లగొండ పీటీసీ**

---------------------------------

**పెట్టుబడుల ప్రోత్సాహం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల కల్పనకు అధికారులు మార్గదర్శకులుగా వ్యవహరించాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశంలో పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల అమలు, ఉపాధి కల్పన కార్యక్రమాల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు.

**భద్రాద్రి కొత్తగూడెం పీటీసీ**

-----------------------------

**రాజన్న సిరిసిల్ల**

రానున్న  వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణకు చర్య లు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రజిత సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ రజిత కీలక సూచనలు చేశారు.

**సిరిసిల్ల పీటీసీ**

--------------------------------